మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మక్తల్ ఎమ్మెల్యే



సాగునీరు విడుదల చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత డిసెంబరు 23 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి యనుముల రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకెళుతున్నారని మఖ్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ దగ్గర మఖ్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ తో కలిసి యాసంగి పంటలకు సాగునీరుని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు సాగునీరు విడుదల చేయడం అదృష్టంగా భావిస్తానని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసి దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. అలాగే రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ద్వారా రైతులకు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రైతులకు సంబంధించిన రైతు యంత్రాలను సబ్సిడీ ద్వారా పొందాలని ఆయన రైతులను కోరారు. యాసంగి పంటలు వేసుకున్న రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అలాగే వారబంధిని అధికారులతో మాట్లాడి ఎత్తివేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. రైతులకు పెట్టుబడి సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగకు రైతు భరోసా పథకం అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. రైతు సంక్షేమ ప్రభుత్వానికి రైతులు అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, చుక్క ఆసి రెడ్డి ,వెంకట్ రెడ్డి ,లక్ష్మారెడ్డి ,సత్య రెడ్డి ,విష్ణు ,హనుమంతు నాయక్, నాగేష్ వీరితోపాటు జూరాల ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్థులను

## సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణికి 45 ఫిర్యాదులు... జిల్లా కలెక్టర్ సంతోష్...**

**గద్వాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (45) ఫిర్యాదులు అందాయి.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తూ అర్జీలను జిల్లాకలెక్టర్‌కు సమర్పించారు. వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు,ఆర్డీఓ ఇంచార్జ్ శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వనపర్తిలో...

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు,వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో 40అర్జీలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్‌లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### నారాయణపేటలో..

**నారాయణపేట టౌన్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి కలెక్టర్ సిక్త పట్నాయక్ దరఖాస్తులను స్వీకరించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్‌కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మొత్తం 21 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు సమావేశ మందిరంలోనే అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ శాలం, ఆర్డీవో రామచందర్, ఏవో జయసుధ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రోత్సాహకాలను

## సద్వినియోగం చేసుకోవాలి:కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 23 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం, వారి భవిష్యత్తు కోసం ఎంతో వెచ్చిస్తోందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని



పభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

పీర్లగుట్టలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. వసతి గృహ విద్యార్థినిలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్, బ్లాంకెట్లను, స్వెటర్లు, రింగ్ బాల్స్, చెస్ మెటీరియల్స్, సహా పలు ఆట వస్తువులను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాల్ని, ఈ సదుపాయాలను చక్కగా వినియోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించడానికి ముందు సూపర్వైజర్లు తినాలని, ఆ తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. హాస్టల్లో స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేసిన కలెక్టర్, మెస్ కమిటీ ఉందా అని సిబ్బందిని అడిగారు. వసతి గృహానికి వంట సామాగ్రి వచ్చినప్పుడు స్టాక్ రిజిస్టర్లో విద్యార్థులచే కచ్చితంగా సంతకం చేయించాలని సూచించారు. తప్పనిసరిగా మెస్ కమిటీ ఉండాలని విద్యార్థులు తమకు వచ్చే ఆహార పదార్థాలు వాటి సామాగ్రిపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. వంట సామాగ్రి వచ్చినప్పుడు అది నాణ్యతగా ఉందో లేదో చెక్ చేసిన తర్వాతనే దించుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### ఇంటికి అనుమతులు..

# కట్టేది కాంప్లెక్స్‌లు

- గద్వాల మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్‌లో ఇష్టారాజ్యం
- అక్రమ నిర్మాణంపై కాలనీవాసుల ఫిర్యాదు
- అవినీతికి కేరాఫ్‌గా టౌన్ ప్లానింగ్ ?



ఇంటి నివాస నిర్మాణానికి అనుమతులు పొంది కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నా స్థల సముదాయ దృశ్యం

**గద్వాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** గద్వాల పట్టణంలో నివాస గృహ నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని, షాపింగ్ కాంప్లెక్స్ కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని పట్టణం లోని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై చిత్తారి వీధికి చెందిన కిరణ్ సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గద్వాల మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ సెక్షన్ లో ఆఫీసర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఫేక్ డాక్యుమెంట్‌లతో ఎల్పీలకు అప్రూవల్ ఇవ్వడం, రిక్రియేషన్ జోన్ అక్రమ కట్టడాలకు పర్మిషన్లు ఇవ్వడం,ఇండ్లకు పర్మిషన్లు ఇచ్చి షాపింగ్ కాంప్లెక్స్ లు కట్టుకున్న అధికారులు పట్టించుకోకపోవడం లేదని విమర్శలు బాహాటంగానే విన్పిస్తున్నాయి. ఇలా అవినీతి దందా మొత్తం టౌన్ ప్లానింగ్ సెక్షన్ అడ్డగా చేసుకొని జరుపుతున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి. గద్వాల టౌన్ గాంధీ చౌరస్తా సమీపంలో మెయిన్ రోడ్డు లో ఇంటికి పర్మిషన్లు తీసుకొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆ కాలని వాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం కొంతమంది సంబంధిత అధికారులకు తెలిసికూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. గద్వాల టౌన్‌లో రద్దీగా ఉండే ప్రదేశాల్లో గాంధీ చౌక్ ప్రధానమైనది. అక్కడ మెయిన్ రోడ్డు ప్లేస్‌లో సెట్ బ్యాక్ లేకుండా కాలనీకి వెళ్లే రోడ్డును కూడా మూసేసి నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. గద్వాల టౌన్‌లోని రథశాల వెనకాల ఉన్న ప్లేస్ లో కూడా ఇంటి పర్మిషన్లతోనే కాంప్లెక్స్ కట్టిన అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు మండిపడుతున్నారు.

**ఇంటికోసమే అనుమతులు..**

గద్వాల టౌన్ గాంధీ చౌక్ సమీపంలో ఖాళీ ప్లేస్ లో ఇంటి పర్మిషన్ కోసం ఓనర్లు మున్సిపాలిటీకి అప్లికేషన్ పెట్టుకున్నారు. రెసిడెన్షియల్ బిల్డింగ్ నిర్మాణాన్ని గ్రౌండ్ ఫ్లోర్ లో మాత్రమే కడతామని స్థల యజమానులు అనుమతులు పొందారు. ముగ్గురు వ్యక్తులు గ్రౌండ్ ఫ్లోర్ రెసిడెన్షియల్ బిల్డింగ్ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా 2/ 12/24న ఇంటి నిర్మాణం కోసం పరిమిషన్ గద్వాల మున్సిపాలిటీ ఇచ్చింది. అక్కడ రెసిడెన్షియల్ బిల్డింగ్ నిర్మించకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కు మాత్రమే పర్మిషన్ తీసుకొని పై అంతస్తు కూడా నిర్మాణం చేపట్టారని కాలనీవాసులు వాపోతున్నారు. అంతేకాకుండా కాలనీకి వెళ్లే ఎనిమిది ఫీట్ల రోడ్డును కూడా కబ్జా చేసి నిర్మాణాన్ని చేపడుతున్నారని మండిపడుతున్నారు. బిల్లింగ్ నిర్మాణాన్ని ఆపాలని మున్సిపల్ ఆఫీసులకు చెప్పిన పట్టించుకోవడంలేదని సంబంధిత ఆఫీసర్ల పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ లో ఆఫీసర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ చక్ర తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత బస్టాండ్ దగ్గర మెయిన్ రోడ్డుకు ఆనుకొని మున్సిపాలిటీ స్థలంలోని డ్రైనేజీపై షేటర్ నిర్మాణానికి, రథశాల వెనకాల కందకం స్థలంలో ఇంటి నిర్మాణాల పేరిట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు పెద్ద ఎత్తున డబ్బులు దండుకున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. రూల్స్ కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి గల్లీ రోడ్లను సైతం కబ్జా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పర్మిషన్ తీసుకొని ఇష్టారాజ్యంగా రూల్స్ బ్రేక్ చేసి నిర్మాణాలు చేస్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద ఎత్తున డబ్బులు దండుకొని ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టేందుకు వారే ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతి పర్మిషన్‌కు ఓ రేటును ఫిక్స్ చేసి మరి అందిన కాడికి దండుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**రోడ్డు కబ్జా కాకుండా చూడాలంటున్న కాలని వాసులు..**

చిత్తారి వీధికి వెళ్లే రోడ్డును కబ్జా కాకుండా చూడాలని కాలనీ వాసులు కోరుచున్నారు. కాలనీ రోడ్డు పై వెళ్లే దగ్గర ఇష్టారాజ్యంగా షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నారని, దీంతో ఇప్పుడు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఇది ఇలానే కొనసాగుతే రోడ్డు కబ్జాపై నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయం పై మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరగా రూల్స్ కు విరుద్ధంగా ఎవరు నిర్మాణాలు చేపట్టిన ఉపేక్షించేది లేదని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఎంక్వయిరీ చేస్తాం అన్నారు. పర్మిషన్ లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తే భవిష్యత్తులో వారికి చాలా ఇబ్బందులు వస్తాయని, టౌన్ ప్లానింగ్ సెక్షన్ పై కూడా దృష్టి పెడతామని త్వరలోనే ఇలాంటి అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి తప్పులు వుంటే చర్యలు తీసుకుంటామని అన్నారు.

# అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- అంబేద్కర్ గురించి అవమానకరంగా మాట్లాడడం విచారకరం
- దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య సంఘర్షణ రాహుల్ పోరాటంపై భయపడ్డ భాజపా
- మీడియా సమావేశంలో సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న వంశీ చంద్‌రెడ్డి, చిత్రంలో అనిరుధ్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** దేశం అంతా చూస్తుండగా అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు విచారకరమని, వెంటనే అమిత్షాను బర్తరఫ్ చేయాలని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి డిమాండ్ చేశారు. మహబూబ్నగర్ డీసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు మీడియా సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో రెండు దురదృష్ట కర అంశాలను గమనించామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజానీకం మొత్తం రాహుల్ భారత్ జోడో యాత్రకు మద్దతుగా నిలిచిందన్నారు. దేశంలో రెండు సిద్ధాంతాల మధ్యన సంఘర్షణ జరుగుతోందని, ఒకటి భాజపా పెత్తం దార్లకు దేశాన్ని కట్టబెట్టాలనేదయితే, రెండోది కాంగ్రెస్ పార్టీ సమ న్యాయ సిద్ధాంతం అన్నారు. రాహుల్ పోరాటాన్ని చూసి భయపడ్డ భాజపా రాహుల్ పై దాడికి తెగబడ్డదని ఆరోపించారు. ఆ క్రమంలోనే రాహుల్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాహుల్ పతాక స్థాయికి తీసుకెళ్తుంటే భారత హోం మంత్రి అమిత్ షా బాబా సాహెబ్ ను ఉద్దేశిస్తూ అవమానకరంగా మాట్లాడటం విచారకరమన్నారు. అమిత్ షా భారత ప్రజానికానికి వెంటనే క్షమాపణ చెప్పాలి ఆయన తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా ను మోడీ వెంటనే బర్తరఫ్ చేయని పక్షంలో ఆయన్ని కూడా అంబేద్కర్ ను మోడీ కూడా అవమానించినట్లు భావించాల్సి వస్తుందన్నారు. అమిత్ షాను హోం మంత్రి పదవి నుంచి తొలగించేంతవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ పై అమిత్ షా మాటలు విచారకరమని, అమిత్ షా మాటలను ఖండిస్తూ మంగళవారం పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులమంతా కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద ర్యాలీగా వెళ్లి సాయంత్రం మహబూబ్‌పగర్ కలెక్టర్కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి లేఖలు పంపిస్తామని అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, ముడ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరీ అనిత మధుసూదన్ రెడ్డి, నాయకులు ఎంపీ వెంకటేష్, బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలందరిని ఆర్థికంగా, శక్తివంతంగా తీర్చిదిద్దాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలను స్వయం సహాయక మహిళా సంఘాల్లో మహిళలను 100 నమోదు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా సాధికారత దిశగా చేపడుతున్న వివిధ రకాల ప్రభుత్వ పతాకాలపై ఎంపీడీవోలు, డిపిఎంలు, ఏపీవోలు, ఈసీలు, ఏపీఎంలు, సీసీలు, గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బందితో సమీక్ష సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి కోసం స్వయం సహాయక సంఘాలు తదితర వాటి ద్వారా రుణాలు అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా రాణించాలని ఒక ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ ఇంటిల్లిపాదీ ఎంతో ఆనందంగా ఉంటారని వారిని చూసి ఇతరులు సైతం ఆదర్శంగా తీసుకొంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహిళా సాధికార దిశగా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా ఈ ఆర్థిక సంవత్సరం 2024-25 లక్ష్యాలను 100 సాధించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం గ్రామీణాభివృద్ధి సంస్థ సంబంధించి వివిధ పథకాలలో 2024-25 నిర్దేశిత లక్ష్యాలను అంది పుచ్చుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోని 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల మహిళలను స్వయం సహాయక సంఘాల్లో నూతనంగా సభ్యురాలుగా నమోదు ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను పరిశీలించి సోషల్ ఆడిటింగ్ సామాజిక తనిఖీలను నిర్వహించి అందుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అధికారులు నమోదు ప్రక్రియలను చేపట్టాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన ఉపాధి హామీ పనులను, అర్హతలు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. అందుకు ఇప్పటికే గుర్తించిన నాణ్యతతో కూడిన పనులను పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీలోని మొక్కలను అత్యంత జాగ్రత్తగా పెంచేందుకు, ఇప్పటినుండే మొక్కల సంరక్షణకు సంబంధించిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు బ్యాంకు లింకేజీ ప్రక్రియను పూర్తి చేసి స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని బ్యాంకుల్లో మహిళా సంఘాలకు అందే రుణాలకు సంబంధించి బ్యాంకర్లతో మాట్లాడడంతో పాటు, మహిళలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలని, సర్వేను త్వరతిగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ పెండింగ్ లేకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వే 100 శాతం పూర్తిచేసి, రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి చిన్న ఓబులేష్, అదనపు పీడీ రాజేశ్వరి, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ , హాజరైన ఆయా శాఖల అధికారులు

## ఇండ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**మక్తల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నా యక్ అన్నారు. మక్తల్ మండలంలోని లింగంపల్లిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లసర్వేను పూర్తి పారదర్శకంగా చేపట్టాలన్నారు. నిజమైన అర్హులు, నిరుపేదలకు మాత్రమే ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. మధ్య దళారులను నమ్మి ఎవరు కూడా మోసపోరాదని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇండ్ల సర్వే చేస్తున్న అధికారులు

## చెన్నంపల్లిలో దారుణం..

**భర్తను కిరాతకంగా గొడ్డలితో నరికి చంపిన భార్య**

**లింగాల,డిసెంబరు23 ప్రభాతవార్త:** భర్తను భార్య కిరాతకంగా గొడ్డలితో నరికి చంపిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నంపల్లి గ్రామానికి మేకల రాములు (40) అతని భార్య ఎల్లమ్మ ఇద్దరు నిత్యం మద్యం సేవిస్తూ గొడవ పడేవారు. ఆదివారం రాత్రి ఇద్దరు కలిసి మద్యం సేవించి గొడవపడ్డారు. మద్యం మత్తులో నిద్రలోకి జారుకున్న మేకల రాములును అతని భార్య ఎల్లమ్మ తలపై రోకలి బండతో తలపై బాది,పక్కనే ఉన్న గొడ్డలితో నరికి హతమార్చింది. సోమవారం ఉదయం ఇంటి చుట్టూ ప్రక్కల వారు వెళ్ళి చూడగా ఘటన వెలుగులోకి వచ్చింది. మృతునికి ముగ్గురు సంతానం ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు. మృతుని తల్లి మసమ్మ ఫిర్యాదు మేరకు అచ్చంపేట సిఐ రవీందర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లింగాల ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయం

**మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే**

**బిజినేపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రజలంటేనే ప్రభుత్వమని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందే విధంగా సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. కిమ్యా తాండా కేసరి బండ ఆంజనేయస్వామి ఆలయానికి సిసి రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు త్రాగునీరు విద్య వైద్యం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టుల మీద ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. గ్రామపంచాయతీలో మోలిక వసతుల కల్పన రోడ్లు డ్రైనేజీలు అంగన్వాడి ప్రభుత్వ పాఠశాలలో ఏమైనా రిపేర్లు ఉంటే సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తయ్యే విధంగా చూస్తానన్నారు. ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మిద్దె రాములు మలిశెట్టి వెంకటస్వామి అమృత్ రెడ్డి హరిశ్వర్ రెడ్డి వీరేందర్ రామ్ చందర్ నాయక్ అంజి కృష్ణ నాయక్ గంగన మోని తిరుపతయ్య కత్తె ఈశ్వర్ ఎంపీటీసీ ఆంజనేయులు దీప్లా నాయక్ భగవంతు శ్రీశైలం గంగన మోని తిరుపతయ్య శ్రీనివాస్ గౌడ్ ఖలీల్ వాల్యనాయక్ గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు తక్షణమే విడుదల చేయాలి

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు భారీ ధర్నా

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 23 ప్రభాతవార్త :** రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు ఇవ్వవలసిన 6,500 కోట్ల రూపాయల స్కాలర్షిప్స్ , ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు నేటికీ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని బిఎస్ఎఫ్, బిసి విద్యార్థి సంఘం, బిజివిఎస్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సోమవారం బిఎస్ఎఫ్, బిసి విద్యార్థి సంఘం, బిజివిఎస్,సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్ నుండి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి బిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోలు రాము, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్ స్వామి, బిజివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ లు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని, అధికారంలోకి వస్తే రాష్ట్ర విద్యారంగాన్ని గాడిలో పెడతానని తెలంగాణ విద్యార్థి లోకానికి హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం అనుసరించిన



జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

విద్యార్థి వ్యతిరేక విధానాలనే కొనసాగిస్తూ, విద్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన విద్యార్థుల వెతలు,తలరాతలు మాత్రం మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధుల విడుదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, ముస్లిం, మైనారిటీ వర్గాల విద్యార్థుల చదువులు, జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ,ఫీజు రియంబర్స్మెంట్ సమస్యను పరిష్కరించి, విద్యార్థుల విద్య భవిష్యత్తు నాశనం కాకుండా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ,మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు , బిసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు, బిసి సంఘం జిల్లా కార్యదర్శి చిట్యాల రాము,అసిఫ్, లోకేష్, బీచుపల్లి, చెన్నకేశవ,బిఎస్ఎఫ్ నాయకులు రాజేష్, శివ,సతీష్, సాయి, తదితరులు ఉన్నారు.

## వాసవి సేవా ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

**కల్వకుర్తి, డిసెంబరు23 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం వాసవీ సేవా ట్రస్ట్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ట్రస్ట్ అధ్యక్షులు కొండూరు గోవర్ధన్, దేవాలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్‌బాబుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండర్‌లో ప్రకటనలు ఇచ్చిన వారిని


వాసవీ సేవా ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. నూతన సంవత్సరంలో సేవా ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శివ్వ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, కోశాధికారి నారాయణరాజు, సత్యసాయి మందిర్ చైర్మన్ గుబ్బ ఈశ్వరయ్య, దాచేపల్లి శ్రీనివాసులు, ట్రస్ట్ కోశాధికారి నారాయణ రాజు, ట్రస్ట్ సభ్యులు కల్వ రమేష్, సంబు వెంకటరమణ, ఆకుతోట రవి, పాపిశెట్టి శ్రీనివాసులు, వీరబొమ్ము గౌరయ్య, పోల శ్రీనివాసులు, చిదిరె శ్రీనివాస్, బచ్చుమురళి, కల్మిచర్ల గోపాల్, వీరమల్ల వేణుగోపాల్, దొంతు శ్రీనివాసులు, వీరమల్ల పాండు, చామల చంద్రశేఖర్, దాచేపల్లి తిరుపతయ్య, దొంతు మోహన్, గందే రవి, మారం రాకేష్, కల్వ ఆంజనేయులు, దాచేపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

**పెబ్బేరు డిసెంబర్ 23 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపాలిటీలోని 2వ వార్డులో శ్రీ వేముల బాలస్వామి నేడు అనారోగ్యం చేత అకాల మరణం చెందాడు విషయం స్థానిక నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే దహన సంస్కారాల నిమిత్తం 5000/-(అ యిదువేలు) పంపించగా ఈ


బాధితులకు నగదు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్థిక సాయాన్ని మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందచేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, కౌన్సిలర్ అక్కమ్మ, సీనియర్ నాయకులు రాములు యాదవ్, దయాకర్ రెడ్డి ,యుగంధర్ రెడ్డి ,టౌన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గంధం సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుక

**ఇటిక్యాల,డిసెంబరు23 ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సోమవారం క్రిస్మస్ సెలబ్రేషన్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో అల్లంపూర్ చౌరస్తాలో గల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్లంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, నియోజకవర్గంలోని


కేకును కట్ చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, పాస్టర్లు. అధికారులు

పాస్టర్లు, తహసిల్దారుల ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకను జరుపుకొని కేకును కట్ చేశారు. అలాగే పాస్టర్లను, అధికారులను సన్మానించారు.ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవులను అన్ని వర్గాల వారిని గౌరవిస్తూ అండగా ఉంటుందని ప్రభుత్వ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందని ముందస్తుగా నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు నియోజకవర్గంలోని అన్ని మండలాల తాహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ వరి విత్తనాలు అందుబాటులో

**వెల్దండ, డిసెంబరు 23 ప్రభాతవార్త:**మండల పరిధిలోని రైతులకు సబ్సిడీ ద్వారా వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిని శోభారాణి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50శాతం సబ్సిడీ ద్వారా కేఎన్ఎం 1638రకం 86కేజీలు, ఎంటియు 10 10.28 కేజీలు, ఆర్ఎన్ఆర్ 15048 12 కేజీలు 100 శాతం సబ్సిడీ అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు కావలసిన రైతులు పట్టా దార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు బ్యాంకు అకౌంట్ జిరాక్సుల కాపీలను వ్యవసాయ శాఖ అధికారులకు అందించి విత్తనాలను పొందాలన్నారు.

## మొబైల్ ఫోన్లు రికవరీ బాధితులకు అందజేత

**నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

**నారాయణపేట టౌన్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో కానీ సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌లో కానీ ఫిర్యాదుచేయాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ తెలిపారు.సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో నందు గత రెండు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో పరిధిలో మొబైల్ ఫోన్లు



మొబైల్ ఫోన్లను అందజేస్తున్న దృశ్యం

పోగొట్టుకున్న 70 మంది బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి తిరిగి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. మొత్తం 70 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగింది. వాటి విలువ సుమారు రూ.10.50లక్షలు ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లను బాధితులకు ఈరోజు అప్పగించడం జరిగింది. అందుకున్న బాధితులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మొత్తం 70 ఫోన్‌లను నూతన టెక్నాలజీ ఐటి కోర్ నుండి ట్రేస్ చేసి పట్టుకోవడం జరిగింది అందుకు ఐటి కోర్ ఎస్సై వసంత, కానిస్టేబుల్ రమేష్ లను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎన్ లింగయ్య, సిఐలు శివ శంకర్, చంద్ర శేఖర్, రాజేందర్ రెడ్డి, రామ్‌లాల్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

**అడ్డాకుల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** వెల్టూరు గ్రామంలో లీడర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు,గణిత దినోత్సవం పురస్కరించుకొని సోమవారంనాడు వేడుకలు నిర్వ


గణిత బోధన పరికరాలతో మేళ నిర్వహిస్తున్న విద్యార్థులు

హించారు ఈసందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ గణితబోధన పరికరాలతో మేళ నిర్వహించారు.అదేవిధంగా విద్యార్థులు గణితంలో వివిధఅంశాలలో ప్రతిభ కనబరిచారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ భారతదేశానికి గణితంలో సుదీర్ఘమైన ప్రస్థానం ఉందని దీన్ని మనం ప్రోత్సహించాలన్నారు.రామానుజన్ గణితంలో చేసిన కృషిగురించి నేటి తరానికి అవగాహన కల్పించడమే కాకుండా మనదేశంలో గణిత శాస్త్ర అధ్యాయానికి అదనపు ప్రోత్సహం అందించాలని సూచించారు 12 సంవత్సరాల వయసులోనే గణితంలో రామానుజన్ మంచి గుర్తింపు పొందారన్నారు,ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, డి విష్ణువర్ధన్ సాగర్, ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

**కోయిలకొండ, డిసెంబరు 23 ప్రభాతవార్త:** కోయిలకొండ మండలం పారుపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం గుంజు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, గేమ్స్ మెటీరియల్ తదితర విద్యాసామగ్రిని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వరదాసు, మండల పిఆర్టీయు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర ముఖ్యఅతిథిగా హాజరై



పంపిణీ చేశారు. గుంజు స్వచ్ఛంద సంస్థ వారు సేవాభావంతో విద్యార్థులకు విద్య సామాగ్రిని అందించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొగులయ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఉపాధ్యాయినీలు ఎం. అరుణ, రాజేశ్వరి, పర్వానా బేగం ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని రాస్తారోకో

**ఆత్మకూరు డిసెంబరు 23 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నూతన మార్కెట్ విధానాన్ని అమలు చేయడం పూనుకోవడం తక్షణమే మానుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రోజు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వామపక్షాల రైతు సంఘాలు ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో రాస్తారో కొందరు వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు రాబర్ట్ ప్రసాద్ మోష తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గడచిన నాలుగు సంవత్సరాలుగా రైతు వ్యతిరేక చట్టాలను తయారుచేసి కార్పొరేట్ రంగాలకు వ్యవసాయ భూములను తాకట్టు పెట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుందని అందుకు నిరసనగా పంజాబ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆందోళ నలను అణిచివేసేందుకు నిర్బంధంగా వ్యవహరిస్తూ రైతుల ప్రాణాలను బలి తీసుకుంటుందని


ఆత్మకూరులోని గాంధీ చౌరస్తాలో
రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న రైతుల అరెస్టులను దేశవ్యాప్తంగా ప్రజలు ఖండించాలని కేంద్ర ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దేశంలో వ్యవసాయాన్ని పండుగగా మార్చాలంటే స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను తక్షణమే అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ రంగాలకు భూములను కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం కొత్త నిశ్చయంతో పని చేస్తుందని తద్వారా రైతులు బజారుపాలు కావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నల్ల చట్టాలను రద్దు చేయడమే కాకుండా స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తూ రైతులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతుసంఘాల నాయకులు లక్ష్మీనారాయణ శెట్టి, బుచ్చన్న , రాజు, శ్యాంసుందర్, తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. రాస్తారోకో మూలంగా ఆత్మకూరు కొత్తకోట ప్రధాన రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

## 14వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగస్తుల సమ్మె

**వనపర్తి టౌన్ డిసెంబరు 23 ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరింది. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ సమీపంలోని ధర్నా చౌక్ లో సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరవధిక సమ్మె కార్యక్రమం చేపట్టారు. వారు సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, వ్రాత పరీక్షా ద్వారా జిల్లా కలెక్టర్, చైర్మన్ ఉన్న కమిటి ఇంటర్వ్యూలలో ప్రతిభ ఆధారంగా ఎంపికై వివిధ



14వ రోజు నిరవదిక సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

స్థాయిలలో ఉద్యోగాలు చేస్తున్నామని పేర్కొన్నారు. సుమారు 18 సం.ల నుండి 19600 మందికి పైగా ఉద్యోగులు పాఠశాల విద్య మెరుగు కోసం కృషిని అందిస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చెయ్యాలన్నారు. తక్షణమే ఉద్యోగ భద్రత తో కూడిన పే స్కేల్, ప్రతి ఉద్యోగికి జీవిత భీమా 10 లక్షలు, ఆరోగ్య భీమా 10 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పదవి విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద 25 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యాశాఖ నియమకాలలో వెయిటేజ్ కల్పించి, సమగ్ర శిక్ష ఉద్యోగులందరికి రీ ఎంగేజ్ విధానాన్ని తీసేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల వనపర్తి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి వహీద్, అధ్యక్షులు శ్రీధర్, మహిళా అధ్యక్షురాలు లోహిత, అన్ని మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగుల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలపై కౌన్సిలర్ మితిమీరిన ఆగడాలు

**పెబ్బేరు డిసెంబరు 23 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలో మహిళా సంఘాలపై మితిమీరిన ఆగడాలు చేస్తూ మహిళలను గందరగోళానికి గురిచేస్తున్న పెబ్బేరు పట్టణంలో 10ఏళ్ల క్రితం నిర్మించిన భవనాన్ని వెంచర్‌కు బాటలేదని వారితో కుమ్ముక్కై మహిళా సంఘాన్ని మున్సిపాలిటీ అనుమతిలేకుండా కౌన్సిలర్ కులగొట్టిందని ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఇటీవల పెబ్బేరు పట్టణంలో రోడ్డులో వెడల్పులో ఇండ్లు కోల్పోయిన బాధితులకు స్థల సేకరణలో భాగంగా మున్సిపల్‌కి సంబంధించిన పార్కును తొలగించారని ఆ విషయంలో మున్సిపల్ చైర్మన్ ను కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని అక్కమ్మ డిమాండ్ చేసిందని మరి ఆమె మహిళా



ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతున్న అధ్యక్షురాలు అక్కల జ్యోతి

సంఘాన్ని పడగొడితే కేసు చేయరా వారికో న్యాయం,వీరికో న్యాయమ అని మహిళా సంఘ అధ్యక్షులు అక్కల జ్యోతి ఆరోపించారు. పట్టణంలో మహిళకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆరు సంఘాల మహిళలకు ఎమ్మెల్యే కేటాయిస్తే మార్కెట్ చైర్మన్ కుమారుడు వచ్చి మా పార్టీకి చెందిన ఒకే సంఘం మహిళా సంఘానికి ఇస్తామని మీకు ఇవ్వమని అడ్డుకోవడంతో తాము మార్కెటింగ్ చేయలేకపోతున్నామన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే స్పందించి మాకు ఇచ్చిన మార్కెట్ మాకు ఇవ్వాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. మహిళా సంఘాలలో కొంతమంది రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటున్నారని మా మహిళా సంఘాల పై జోక్యం చేసుకుంటే రానున్న ఎన్నికల్లో వారికి మహిళలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కాలనీలో మహిళా సంఘానికి ప్రతి మూడేళ్లకో సారి ముగ్గురు మారుతున్న 20 ఏళ్ల నుంచి మారలేదని తప్పుడు సమాచారం చేస్తున్నారని మహిళా మండల అధ్యక్షురాలు అక్కల జ్యోతి తెలియజేశారు. పరమేశ్వరి టౌన్ లెవెల్ ఫెడరేషన్ మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి బుజ్జమ్మ, కనకదుర్గ ఏరియా లెవెల్ అధ్యక్షురాలు కవిత, అంబేద్కర్ ఏరియా లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు కథలమ్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, పత్తిరెడ్డి పార్వతి, మహేశ్వరమ్మ ,నస్రిన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజేషన్ చేయాలి

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం**

**ఇటిక్యాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని వైద్య ఆరోగ్యశాఖలో ఎళ్ల తరబడిగా పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు,అవుట్సోర్సింగ్ ఏఎన్ఎంలు,ల్యాబ్ టెక్నీషియన్‌లను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సోమవారం హైదరాబాదులోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నరసింహను సామాజిక ఉద్యమకారుడు డా. ప్రేమ్ కుమార్ కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో ఎన్నో ఏళ్ళుగా వెట్టి చాకిరీ చేస్తూ జీవనం గడుపుతున్న సెకండ్ ఏఎన్ఎంలు, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలను పర్మనెంట్ చేయాలని అలాగే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని వైద్య ఆరోగ్యశాఖలో వారి సేవలు ఎంతో అమూల్యమైనవని జీవితాలు ఫణంగా పెట్టి కరోనా సమయంలో కూడా వారు పని చేసారని, గ్రామీణ ప్రాంతాలలో గర్భిణీలకు, బాలింతలకు, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని ఉద్యోగ నియామకాల్లో 50 వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వారికి ఆరోగ్యభీమా. ఎక్స్ గ్రేషియా వర్తింపజేయాలని ఎటువంటి రాత పరీక్ష లేకుండా వీరిని రెగ్యులర్ చెయ్యాలని, జనాభా ప్రాతపదికన సబ్ సెంటరు ఏర్పాటు చేయాలని.. గత ప్రభుత్వం ల్యాబ్ టెక్నీషయన్లు ఔట్ సోర్సింగ్,కాంట్రాక్టు నర్సుల సమస్య పరిష్కారానికి వేసిన త్రిసభ్య కమిటీ ద్వారా న్యాయ పరమైన చిక్కులు తొలగించి వీరిని రెగ్యులర్ చెయ్యాలనీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరినట్లు సామజిక ఉద్యమకారుడు డా. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్య క్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు...


మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు క్రీడా ఏకరీతి దుస్తుల పంపిణీ

**వనపర్తి టౌన్ డిసెంబరు 23 ప్రభాతవార్త:** క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సీఎం కప్, రాబోయే రోజుల్లో జరిగే పాఠశాల క్రీడలలో విద్యార్థులు క్రీడా ఏకరీతి దుస్తులతో పాల్గొనేలా పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే వనపర్తిలోని హరిజనవాడ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయిని రంగనాయకమ్మ ఆలోచన మేరకు ఆమె మిత్రురాలైన నాగమణి వట్టెం సంఖ్యల సుహాసిని, శ్రీనివాస్ ముదిరాజ్ ముగ్గురు పదివేల చొప్పున ఖర్చు చేసి విద్యార్థులకు 22 జతల క్రీడా ఏకరీతి దుస్తులను పంపిణీ చేశారు. వీటిని సోమవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ దాతలను అభినందించారు. క్రీడలు విద్యార్థులకు శారీరక మానసిక వికాసాన్ని కలగజేస్తాయని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నయ్య, వాకిట రవికుమార్, విజయభాస్కర్, వెంకట్ రాములు, రుక్కుద్దీన్, రంగన్న, అరవిందు, బాలస్వామి, వరలక్ష్మి, నాగరాజు, సందీప్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

## అయ్యప్ప స్వాములకు అన్నదానం

**అమరచింత డిసెంబరు 23 ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని హరి హర అయ్యప్ప పుత్ర స్వామి దేవాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎస్ఎం అరుణ్ కుమార్ అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్, డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ హాజరై శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాముల తో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్చాల ఆరోగ్య కేంద్ర
## సబ్ సెంటర్‌లో ముక్త భారత్ అభియాన్


వైద్య పరీక్షల కోసం నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

**కల్వకుర్తిరూరల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:**ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మార్చాల గ్రామ ఆరోగ్య కేంద్ర సబ్ సెంటర్‌లో సోమవారం గ్రామానికి చెందిన పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా టీబీ వ్యాధి లక్షణాలు కనిపించిన వ్యక్తుల నుంచి నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్ కుమార్, ఎంపిహెచ్ ఎస్ జి శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ సత్యం, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో మాజీ ప్రధాని
## పీవీ నరసింహారావు వర్ధంతి వేడుకలు

**ఇటిక్యాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశ మాజీ ప్రధాని దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ జోగుల రవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రుక్మానందరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, నాయకులు వెంకటన్న, భాస్కర్‌రెడ్డి, బజారన్న, అల్లా బకాష్, వెంకటేష్, ఈదన్న, బలరాముడు, శాంతన్న, రాముడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బందికరంగా మారిన మట్టి రోడ్డు

**కృష్ణ, డిసెంబరు 23 ప్రభాతవార్త :** కృష్ణ మండలము, గుడేబల్లూరు గ్రామంలోని దేవుని చెరువు అలుగు కారణంగా మట్టిరోడ్డు నీట మునగడంతో, ఆ మార్గంలో వెళ్లే రైతులకు, శవయాత్రలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డు సమస్యతో దాదాపు 8 నెలలుగా అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అయినా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని, ఈ సమస్య పరిష్కారం కొరకై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించక పోవడానికి గల కారణాలేంటో అధికారులు తెలపాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని, లేకపోతే జాతీయ రహదారి 167 పై ధర్నాలకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## ప్రజావాణిలో మొత్తం (59) దరఖాస్తులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ కలెక్టరేట్ విభాగాల సూపరిండెంట్ యూసుఫ్ అలీ, మునురుద్దీన్‌లు స్వీకరించారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం (59) దరఖాస్తులు రాగా భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని, వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## ఆరవ రోజుకి న్యాయవాదుల నిరసన

**గద్వాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** పూడూరు శివారులోకి న్యాయస్థానాలను తరలించవద్దన్నా డిమాండ్‌తో న్యాయవాదులు చేపడుతున్న రిలే నిరసన దీక్షలు సోమవారానికి ఆరో రోజుకి చేరుకు



న్నాయి. సోమవారం దీక్షలో యువ న్యాయవాదులు ఎస్జి ప్రవీణ్ కుమార్, కె సురేష్, కావలి వెంకట్, గౌడంపల్లి మహాలక్ష్మి కూర్చున్నారు. సీనియర్ న్యాయవాదులు ఇస్మాయిల్, శ్రీకాంత్, రాధాకృష్ణ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, వెంకట్ రామిరెడ్డి, సుధాకర్ లు పూలమాలలు వేసి వీరిని దీక్షలోకి ఆహ్వానించారు.

## మా నాన్న బాగోగులు మేమే చూసుకుంటాం

**కొడుకులు పట్టించుకోవడంలేదని ప్రజావాణిలో తండ్రి ఫిర్యాదు**

**ట్రిబ్యునల్ కి రావాలని కలెక్టర్ ఆదేశంతో దారికి వచ్చిన తనయులు**

**వయో వృద్ధుని సమస్యకు పరిష్కారం**



**మహబూబ్‌నగర్ బ్యూరో డిసెంబరు 23 ప్రభాతవార్త:** తన ఇద్దరు కుమారులు తన బాగోగులు పట్టించుకోవడం లేదని ప్రజావాణి ద్వారా దరఖాస్తు చేసుకున్న వయో వృద్ధుడు సాయన్న సమస్య కు అధికారులు స్పందించి న్యాయం చేశారు. వివరాల్లోకి వెళ్తే మహబూబ్ నగర్ పట్టణం టిడి గుట్టలో నివాసం ఉంటున్న 78 సం॥ల వయో వృద్ధుడు సాయన్న తన ఇద్దరు కుమారులు శేఖరయ్య, శివ రాములు తనను తన భార్య చెన్నమ్మను సరిగా చూసుకోవటం లేదని 20 రోజుల క్రితం ప్రజావాణి లో వయో వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం కింద ఫిర్యాదు చేస్తూ తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ దరఖాస్తు పై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అర్‌డిఓకు తగు చర్య తీసుకోవాలని సూచించారు. వృద్ధుని ఫిర్యాదుపై స్పందించిన మహబూబ్‌నగర్ అర్‌డిఓ నవీన్ వృద్ధుని ఇద్దరు కుమారులకు వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం క్రింద ఈనెల 5 న నోటీస్ జారీ చేస్తూ ఈ నెల 28న అర్‌డిఓ ట్రిబ్యునల్, ఆర్‌డిఓ కార్యాలయంకు హాజరు కావాలని ఆ నోటీస్‌లో పేర్కొన్నారు. నోటీస్ అందుకున్న ఇద్దరు కుమారులు తన తండ్రి సాయన్న బాగోగులు చూసుకుంటామని రాజీకొచ్చారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన వయో వృద్ధుడు సాయన్న జిల్లా కలెక్టర్, అర్‌డిఓకు కృతజ్ఞతలు తెలుపుతూ తాను ఇచ్చిన ఫిర్యాదును వాపసు తీసుకున్నారు.

## పోలీస్ అధికారులు, బాధ్యతగా పని చేయాలి

**నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**



**నారాయణపేట టౌన్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ప్రజల భద్రతపై భరోసా కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్ పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి లింగయ్య, సిఐ లు శివ శంకర్, చంద్ర శేఖర్, రాజేందర్ రెడ్డి, రామ్ లాల్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, రాజు, రామ్ లాల్, రమేష్, రాము, భాగ్యలక్ష్మిరెడ్డి, నవీద్, కృష్ణం రాజు, వసంత, సునిత, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మర్రిని పరామర్శించిన ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ఇటీవల మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి మృతి చెందడంతో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మరణించిన రోజున రాలేనందున సోమవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తిమ్మాజిపేట మండలంలోని నేరళ్ళపల్లి గ్రామానికి చేరుకొని మర్రి జంగిరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మర్రి జనార్దన్‌రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అదే విధంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శించి జంగిరెడ్డి చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మర్రి జనార్దన్‌రెడ్డితో కొద్దిసేపు ముచ్చ టించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## మెటల్ రోడ్డు పనులకు భూమి పూజ



పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబరు 23 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి–రాచూర్ గ్రామాల మధ్యలో గల మట్టి మెటల్‌రోడ్డు పనులను సోమవారం అజూర్ పవర్ 37 ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెటల్ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసిన హజూర్ పవర్ 37 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధికారులు సైట్ ఇంజనీర్ మోనేష్ ఇంచార్జ్ సుధీర్ టెక్నీషి యన్స్ గోవింద్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు హరికిషన్‌నాయక్‌తో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, పర్వతాలు, గుత్తివెంకటయ్య, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కడారి శ్రీనివాస్ యాదవ్, జంగారెడ్డి, రమాకాంత్‌రెడ్డి, తాజుద్దీన్, గంది కోట రాజు, పడకంటి వెంకటేష్, చంద్రశేఖర్, రాజ్, శివ, రాములు, భక్యానాయక్, గోపాల్, నరేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



బెనహర్‌కు కేక్ తినిపిస్తున్న వంశీచంద్ రెడ్డి

**మహబూబ్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మహబూబ్నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీ చంద్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అని రుధ్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానమని అన్నారు. కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ అన్ని పండుగలను కలిసిమెలిసి జరుపుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు ఎన్పీ.వెంకటేష్, ఖాజా అజ్మత్ అలీ, మహ్మద్ అవేజ్, షా ఫైసల్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడవ వార్డులో తీరిన తాగునీటి ఎద్దడి

**మక్తల్ టౌన్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** వెంకటరమణ కాలనీ ఏడవ వార్డులో నీటి సమస్య ఎక్కువగా ఉందని గతంలో గవర్నమెంట్ పరంగా బోరు వేసి, నీళ్ల ట్యాంకు నిర్మించి తాగునీటి సమస్యకు కొన్ని రోజులు ఉపశమనం లభించింది. గత కొన్ని రోజులుగా బోరు మోటర్, స్టార్టర్ చెడిపోయి నీటికి ఇబ్బంది ఉండడవల్ల, మున్సిపాలిటీకి సమస్యను వివరించగా వారు కొత్త మోటర్ స్టార్టర్ ను మున్సిపాలిటీ సిబ్బంది ఫిట్ చేయడం జరిగింది. అలాగే మున్సిపాలిటీ నుండి కాలనీలో డ్రైనేజీలు, రోడ్లు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీవాసులు మాట్లాడుతూ నీటి సమస్యను తీర్చిన మున్సిపల్ అధికారులకు, కౌన్సిలర్ కు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఏడో వాడు మున్సిపల్ కౌన్సిలర్ జ్యోతి రాజేష్ గౌడ్, మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ సత్యం గౌడ్, మున్సిపల్ సిబ్బంది అనిల్, బాబు, అంజి, బాలస్వామి, కాలనీవాసులు శ్రీరామ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

**మక్తల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ఇటీవల సంగంబండ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి సీనియర్ మహిళల షూటింగ్ బాల్ ఎంపికలో గురుకుల పాఠశాల బాలికలు పాల్గొని, చక్కని క్రీడా ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రకళ, కోచ్ బి.గోపాలం తెలిపారు. పాఠశాలకు చెందిన బాలికలు వైష్ణవి, నవ్య శ్రీ, కౌసల్య, అరుణ, రేణుక, మేఘ వర్ష, మనిషా, భవిత, కవిత, తేజస్విని, మేఘన, ఐశ్వర్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 24 నుండి 26 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను, పిఈటి శ్రీలతను శాలువాలతో సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభను కనబరిచి పతకాలను సాధించాలని వారు ఆకాంక్షించారు.

# మాదకద్రవ్యాలను అరికట్టండి

**నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కే సీతారామారావు**



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** జిల్లాలో డ్రగ్స్, మాదకద్రవ్యాలు, అన్ని రకాల నార్కోటిక్స్‌పై జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో, పాఠశాలల్లో, కళాశాలలో, విస్తృతంగా అవగాహన కల్పిస్తూ మాధక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని, జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చడానికి సంబంధిత శాఖలైన పోలీసు, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, శాఖలన్నింటిని సమన్వయ పరిచే బాధ్యత వైద్యశాఖ తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కే.సీతారామారావు తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నిర్మూలన, ఇంటర్మీడియట్ పరీక్షలు, విద్యార్థుల హాజరు, ఒత్తిడికి గురి కాకుండా చదువు కొనసాగింపుపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తూ మాట్లాడారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురికావడం జరుగుతుందని, వారికి ఒత్తిడి లేని చదువును విద్యార్థులకు అందించాలని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పరిగణలోకి తీసుకోవాలని, చెడు అలవాట్లకు లోనైనా విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అనేక రకాల సదుపాయాలు కల్పిస్తున్నాయని, విద్య కొరకు ప్రభుత్వం అత్యధిక ఖర్చు చేస్తుందని, విద్యార్థులు కూడా మంచిగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్య పరచాలని అదనపు కలెక్టర్ తెలియజేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో అంతర్గత పరివర్తన వచ్చే విధంగా యోగా మెడిటేషన్ లాంటి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. ఒత్తిడికి గురి అయిన పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఆరోగ్యపరంగా మానసికపరంగా ఒత్తిడి ఎదుర్కొంటున్న విద్యార్థులకు 14416 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా 24/7 ఉచిత సేవలు అందిస్తారని తెలిపారు. టెలి మానస్ ద్వారా నిష్ణాతులైన సైకాలజిస్టుల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్ ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, డీఈవో రమేష్‌కుమార్, డీఎంహెచ్వో స్వరాజ్యలక్ష్మి, డిడబ్ల్యుఓ రాజేశ్వరి, సంబంధిత శాఖల అధికారులు, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాగుంటేనే రాష్ట్రం పచ్చగా ఉంటుంది



రైతులకు స్ప్రింక్లర్ సెట్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** రైతు బాగుంటే రాష్ట్రం పచ్చగా ఉంటుందని విశ్వసించి ఆర్థికంగా ఎన్ని అవరోధాలు ఏర్పడిన రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా ముందుకు సాగుతున్న ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. జాతీయ రైతు దినోత్సవంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సబ్సిడీ స్ప్రింక్లర్ సెట్ల పంపిణీ చేశారు. బిజినేపల్లి రైతు వేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని రుణ మాఫీ చేసి రైతన్నకు రుణ విముక్తి కల్పించిందన్నారు. 40 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు మేలు జరిగేందుకు ప్రభుత్వం 31 వేల కోట్ల రూపాయలతో రుణ విముక్తి చేసి రైతన్న గుండె బరువు దించిది అన్నారు. బిజినేపల్లి మండలంలో 59 కోట్ల రూపాయలతో 7329 రైతులకు లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాక సన్న వడ్లకు క్వింటాలకు 500రూపాయలు బోనస్‌గా చెల్లించామని చెప్పారు. సంక్రాంతి పండక్కి రైతులందరికీ రైతు భరోసా అందుతుందని గత ప్రభుత్వం మాదిరి కొండలకు గుట్టలకు రోడ్లకు ప్లాట్ లకు రైతు బంధు అందదన్నారు. రైతుబంధుతో 21 వేల కోట్ల రూపాయలు వృధా చేశారని విమర్శించారు తమ ప్రభుత్వంలో చిన్న సన్నకారు రైతులకు అండగా ఉంటామని సాగుచేసిన ప్రతి రైతుకు రైతు భరోసా అందుతుందని వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ కన్న జగన్ ఏవో నీతి రెడ్డి తాసిల్దార్ శ్రీరాములు ఏఈఓ మధు కాంగ్రెస్ పార్టీ నాయకులు మిద్దె రాములు మలిశెట్టి వెంకటస్వామి అమృత్ రెడ్డి గంగన మోని తిరుపతయ్య చంద్ర గౌడ్ భగవంతు గౌడ్ వీరేందర్ రామ్ చందర్ శ్రీనివాస్ గౌడ్, ఖలీల్ తిరుపతయ్య గౌడ్ అవంతి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



జెండా ఊపి అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మూసాపేట్, డిసెంబరు23 ప్రభాతవార్త:** మండలం జానంపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 అంబులెన్స్‌ను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి (జిఎంఆర్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలోని అంబులెన్స్ సదుపాయం లేదని మండల నాయకులు నా దృష్టికి తీసుకొచ్చారు ఎమ్మెల్యే స్పందిస్తూ వైద్యాన్ని సరైన సమయంలో వైద్యం అందించకపోతే రోగులకు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని గ్రహించి నేడు 108 అంబులెన్స్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వైద్యంకోసం జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్సులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో కుంటుపడిన వైద్య రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక్షాళిస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే వైద్యారోగ్య శాఖపై ఏకంగా రూ.10 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. అనంతరం మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే పీవీ నరసింహారావు సేవలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, తాసిల్దార్‌రాజు, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీ ఓ అనురాధ, ఆర్ఐ రవికుమార్, జానంపేట సీనియర్ నాయకులు బి రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, జవ్వాజి శివరాములు మాజీ సర్పంచ్ చెన్నమ్మవెంకటయ్య, రాంకుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

## తూముకు రంధ్రం తెరిచిన వ్యక్తిపై చర్య తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

**చిన్నచింతకుంట, డిసెంబరు 23 ప్రభాతవార్త :** మండలంలోని అల్లీపూర్ గ్రామ సమీపంలో గల చెరువు తూముకు అక్రమంగా రంధ్రం తెరిచి నీటిని కిందికి వదిలిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామ మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాసులు, కురుమూర్తిలు సోమవారం మండల తహసిల్దార్ ఎల్లన్నకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులో చేప పిల్లలను పెంచుకొని జీవనోపాధి చేసుకొని జీవించేవారమని మత్స్యకారులు తెలిపారు. గ్రామ సమీపంలోని చెరువులో గత సెప్టెంబర్ మొదటి వారంలో చేపపిల్లలను వదిలామని, ప్రస్తుతం చేపలు అరకిలో నుంచి కిలో వరకు పెరిగాయని మత్స్యకారులు తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా చెరువు తూము కింద రంధ్రం తెరవడంతో నీటితోపాటు చేపలు సమీప పొలాల్లోకి వెళ్లాయని దీంతో చేపలు చనిపోయి వేలరూపాయలు నష్టం జరిగిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చేప పిల్లల పెంపకంపై సుమారు 50 మత్స్య కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నామని అక్రమంగా తూమురంధ్రం తెరవడంతో చేపలు చనిపోయి నష్టం మిగిలిందని మత్స్యకారులు తహసిల్దార్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా తూమురంధ్రం తెరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తమకు న్యాయంచేయాలని తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మత్స్యకారులు ఇచ్చిన ఫిర్యాదుపై తహసిల్దార్‌కు వివరణ కోరగా అక్రమంగా చెరువు తూము రంధ్రాన్ని తెరిచిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటూ, చనిపోయిన చేపల నష్టాన్ని భరించాలని పోలీస్, నీటిపారుదల శాఖ కు రిపోర్ట్ పంపిస్తామని, దీంతోపాటుగా ఉన్నతాధికారులు కూడా నివేదిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మత్స్యకారులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి ధర్నా



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నేతలు

**చిన్నచింతకుంట, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ఉంద్యాల బీటీ రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్‌తో సోమవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి ధర్నా కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబి రాజు, అసెంబ్లీ కన్వీనర్ కురువ రమేష్‌లు మాట్లాడుతూ ఉంద్యాల నుంచి సిసి కుంట మండల కేంద్రానికి ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద మూడు కోట్ల 50 లక్షలు మంజూరై మూడు సంవత్సరాలపైగా అవుతున్న ఇప్పటికీ అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే ఇప్పటికీ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదన్నారు .ఇంకా సుమారు కిలోమీటర్ పైగా సిసి, ప్యాచ్‌లు మిగిలి ఉన్నాయని, ఉంద్యాల గ్రామంలో బస్టాండ్ నుంచి చెరువు కట్ట వరకు సిసి రోడ్డు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు పనులు చేపట్టలేదని దీని ద్వారా వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారి గ్రామస్తులు మండల కేంద్రానికి రావడానికి ఎన్నో అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వెంటనే సిసి రోడ్డు పనులు, ప్యాచ్ పనులను పూర్తి చేయాలని వారి డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ ఎల్లన్నకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దశరథ్, జిల్లా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, శ్రీకృష్ణ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ జి, నాయకులు బాలచందర్ శెట్టి, రుతు కుమార్ గౌడ్, మహేందర్ యాదవ్, రాజు నాయక్, వెంకటయ్య గౌడ్, వికాస్ నరసింహ, పోతు వెంకటేష్, దినేష్, నరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేల స్వభావాన్ని బట్టి పంట సాగు చేయాలి

**జిల్లా సహాయ సంచాలకులు టి.వాసు.. ప్రత్యామ్నాయ ఎరువులపై అవగాహన**



రైతులకు డీలర్లకు అవగాహన

**తెలకపల్లి, డిసెంబరు 23, ప్రభాతవార్త:** రైతులు నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు టి వాసు అన్నారు. సోమవారం మండల పరిధిలోని దాసుపల్లి క్లస్టర్ రైతు వేదిక నందు రైతులకు, ఎరువుల వ్యాపారం చేసే డీలర్ల అందరికీ నాగర్ కర్నూల్ డివిజన్ స్థాయి అవగాహన సమావేశం జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ సహాయ సంచాలకులు టి వాసు పాల్గొని మాట్లాడుతూ డిఏపి ఎరువుల వాడకానికి ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువుల వాడకం పైన రైతులకు అవగాహన కనిపించారు. చౌడు నెలల శాతం ఎక్కువగా ఉన్నందున రైతులు నేల స్వభావాన్ని బట్టి పంటలు అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువుల వాడకంపై కీలకమైన విషయాలను వివరించారు. రైతులు పంటలకు అనుగుణంగా మైక్రో న్యూట్రియన్ట్స్ అదే విధంగా బయో ఫెర్టిలైజర్స్‌ను, జీవన ఎరువులను వాడుకుని పంటల సాగును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రస్తుత పంటల చీడపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, డైరెక్టర్ వి రాజ మహేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నర్మద, వ్యవసాయ విస్తరణాధికారులు నవీన్ కుమార్, సంతోష్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ నిర్మాణం కోసం తహసీల్దార్‌కు వినతి

**వెల్దండ, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టాలని సోమవారం ప్రజావాణిలో మండల కేంద్రానికి చెందిన కూన పాండు తహసిల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. డ్రైనేజ్ నిర్మాణానికి కాలనీవాసులు సహకరిస్తామని తహసీల్దార్‌కు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపడతామని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**బిజినేపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన గాజుల ఇసాక్ (50) మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో మృతి చెందిన ఇసాక్ కుటుంబాన్ని మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు నెల్లికంటి మహేష్ రెడ్డి పరామర్శించి భరోసా కల్పించి ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. చీర్నం బాలస్వామి, మంగి కురుపయ్య ,ముస్లిం మైనారిటీ సంఘం అధ్యక్షులు తాజుద్దీన్, సాయి, రిజ్వాన్, గఫూర్, ఆనంద్‌రెడ్డి, రుక్మోద్దీన్, ఇర్ఫాన్, అర్షద్, సాజిద్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## కరాటే పోటీల్లో ద్వితీయ బహుమతి

**వనపర్తి టౌన్ డిసెంబరు 23 ప్రభాతవార్త:** రతన్ టాటా కప్ సౌత్ ఇండియా న్యూ మార్ష్ కుంగ్ ఫూ కరాటే దు థాయి క్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు ఇటీవలే షాద్ నగర్ లో జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వనపర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ హరిజనవాడ విద్యార్థులు తమ చక్కటి ప్రతిభను కనబరిచారు. పాఠశాలలో ఏడోవ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థి రంగస్వామి చక్కటి ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి గెలుపొందారు. రంగస్వామిని ట్రైనర్ గా వ్యవహరించారు. మాస్టర్ రాము, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## కొనసాగుతున్న ఇండ్ల సర్వే



ఇండ్ల సర్వే నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

**జడ్చర్ల, డిసెంబరు23 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నది. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు 4వ వార్డు శ్రీ వేంకటేశ్వర కాలనీ, మాధవరావు కాంపౌండ్‌లలో లబ్దిదారులను కలిసి వివరాలు సేకరించారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా ఇంటింటి సర్వే నిర్వహించడం జరిగిందని 4వ వార్డు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పెద్దిబాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు ఉమా మహేశ్వరి, మెప్మ సి.ఎల్.ఆర్.పి సునీత, వార్డు ఆఫీసర్ అశ్విని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకట్ దాస్

**బిజినపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఆరోగ్య కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాన్ని 100 ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూర్తి చేయాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకట్ దాస్ అన్నారు. సోమవారం లట్టుపల్లి, బిజినపల్లి, పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. సికిల్ సెల్ పరీక్షలను ప్రతి ఒక్కరికి నిర్ధారణ పరీక్షలు క్షేత్రస్థాయిలో చేయాలని సూచించారు. వందరోజుల క్షయ ముక్తభారత్ కార్యక్రమాన్ని సూచించిన దినాలలో పూర్తిచేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న హోమియో ఆయుర్వేదిక్ వైద్యుల సేవలు ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ఎం నారాయణస్వామి డా. టి ప్రసన్న డాక్టర్ మేఘనా రెడ్డి, బిజినపల్లి మెడికల్ ఆఫీసర్ డా. శివకుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది చంద్రశేఖర్, యాదగిరి, సుమిత్ర తదితరులు ఉన్నారు.

## ప్రతి వ్యక్తి జీవితం

## గణితంతో ముడిపడి ఉంది

**తెలకపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి నిత్యం జీవితం గణిత శాస్త్రంతో ముడిపడి ఉందని విశ్రాంత జిల్లా విద్యా శాఖ అధికారి విజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించి వివిధ రకాలైన గణిత శాస్త్ర పరికరాలను తయారుచేసి గణిత మేళాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మురళి మోహనచార్యులు, కరుణ శ్రీ, శ్రీనివాసులు, మల్లేష్ గౌడ్, భాస్కర్, రవికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్రం నిధులేవి?

- హామీల అమలేది..?
- సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలి
- ఎంపీ డీకే అరుణ



ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయ పరమైన సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డీకే అరుణ ప్రభుత్వానికి సూచించారు. సోమవారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఆమె పర్యటించారు. మహబూబ్‌నగర్ టీటీడీ కల్యాణ మండపం వద్ద గత 14రోజులుగా తమ డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల దీక్షాశిబిరాన్ని ఆమె సందర్శించి వారికి సంఘీభావం పలికారు. ఈసందర్భంగా ఉద్యోగులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అరుణమ్మకు అందజేశారు. గతంలో ఉద్యోగులు సమ్మె చేస్తున్న సమయంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చాయ్ తాగినంత సేపట్లో మీసమస్య పరిష్కరిస్తానని మాట ఇచ్చి ఇప్పుడెందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మరి రోజూచాయ్ తాగుతున్నారు. కదా అప్పుడైనా ఉద్యోగులు గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల కోసం ఓట్ల కోసం అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి మాట తప్పారని చెప్పారు.

## బీటీ రోడ్లు నిర్మించేందుకు ఆమోదం



కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

**వనపర్తి టౌన్ డిసెంబరు 23 ప్రభాతవార్త :** వనపర్తి మండల పరిధిలోని అంజనగిరి తండా, చెరువు ముందరి తండాలకు అటవీ భూములగుండా బీటీ రోడ్లు నిర్మించేందుకు జిల్లా స్థాయి ఫారెస్ట్ కమిటీ ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఫారెస్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి మండలపరిధిలోని అంజనగిరితండా, చెరువు ముందరితండాలకు అటవీ భూముల గుండా బీటీరోడ్లు నిర్మించేందుకు జిల్లాస్థాయి ఫారెస్ట్ కమిటీ ఆమోదిస్తున్నట్లు చెప్పారు. పిఆర్ రోడ్డు నుంచి అంజనగిరి తండా వరకు బీటీరోడ్డు వేసేందుకు 0.69హెక్టార్ల భూమి, అదేవిధంగా చెరువు ముందరితండాకు వయా పెద్దతాండ రహదారికి0.91హెక్టార్ల అటవీభూమి కేటాయించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి తిరుమల రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్, గిరిజన శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షాను భర్తరఫ్ చేయాలి

**ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ డిమాండ్**

**గద్వాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని, లేకుంటే ప్రధాని మోదీ అమిత్‌షాను మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని అయన డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ప్రజా స్వామిక వాదులు ప్రతి ఒక్కరు ఖండించాలని డిమాండ్ చేశారు. ఏఐసిసి ఆదేశానుసారం మంగళవారం జరిగే నిరసన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వామపక్ష నాయకులు, ప్రజాసంఘాలు, దళిత సంఘాల నాయకులు అందరూ పాల్గొని మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించి, అరెస్ట్ చేసే వరకు పోరాటం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్ చౌరస్తా నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ కొనసాగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ చైర్మన్ సరిత తిరుపతయ్య, ఓబీసి చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లా రెడ్డి, పీసీసీ సభ్యులు శంఖర్, కలీం, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు ఇసాక్, గట్టు అధ్యక్షులు గౌస్, జమాల్, ఆనంద్,తిమ్మోజీ సురేష్,గణేష్, అయ్యాన్న, మధుసూదన్ బాబు, దిలీప్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## రైతు దినోత్సవంలో రైతులకు కలెక్టర్ సన్మానం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** గ్రామభారతి జ్ఞాననేత్ర నేచర్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని జిల్లా కేంద్రానికి సమీపంలోని వృత్తి శిక్షణా కేంద్రంలో నిర్వహించారు. ఇందులో భాగంగా కలెక్టర్ చే ప్రకృతి సేద్యం చేస్తున్న కొంత మంది రైతులని సన్మానించడం, ప్రకృతి సేద్య నిపుణులు సలహాలు అందించడం, ప్రకృతి సేద్య రైతుల అనుభవాలు పంచుకున్నారు. ఈ కార్యమంలో గ్రామభారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మనం నేలసారం కోల్పోయేలా చేస్తున్న వ్యవసాయ విధానాలకు కారణాలు, ప్రస్తుతం అవలభించాల్సిన విధానాల గురించి వివరించారు. అలాగే నారాయణపేట్ జిల్లా గౌరవ అధ్యక్షులు డా. జయచంద్రమోహన్ ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి వివరించగా జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ సరైన పద్ధతులు పాటిస్తే రైతులందరు ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని చెప్పడం జరిగింది. జ్ఞాననేత్ర నేచర్ స్కూల్ ఫౌండర్ సత్యనారాయణ ఉగాది నుండి నారాయణపేట్ పట్టణంలో మూలం సంత జరగటం గురించి, మూలం సంతలో ప్రకృతి సిద్ద ఆహార పదార్థాలు, వస్తువులు అమ్ముకోవచ్చని, దీని ద్వారా ప్రకృతి సిద్ద రైతులకు, చేతి వృత్తుల వారికి సహకారం అందుతుందని కలెక్టర్ కి వివరించి మూలసంత ప్రకటన కార్డులను కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభిప జేస్తూ, ఫిబ్రవరిలో జరిగే పాలేకర్ మీటింగ్ ను నారాయణపేట్ జిల్లా రైతులకు కూడా శిక్షణకు వెళ్ళేలా చేస్తే బావుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మదన్ గుప్తా ,లింగం,జాన్ సుధాకర్, డా. జయచంద్ర మోహన్ ,శివకుమార్ ,సత్యనారాయణ, స్రవంతి, డా. రాంబాబు, రఘోత్తమాచార్యులు,విద్యాసాగర్ ,రవి మరియు ప్రకృతి సేద్య రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కు ఏఐపీకేఎంఎస్ నాయకుల వినతి

**నారాయణపేట టౌన్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలందరికీ ఇచ్చిన మాట ప్రకారం సంవత్సరానికి 12000 జీవన భృతి అమలు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ కు ఏఐపీకే ఎంఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే జీవన భృతిని అందించాలన్నారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఏడాదికి 12000 ఇస్తామని రెండు విడతల్లో 6000 రూపాయలు చొప్పున అమలు చేస్తామని నేటికీఅమలుపరచలేదన్నారు. రైతుల్లో 50 పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారన్నారు. వీరికి ఎడాది పొడవున పని దొరకడం లేదు పని దొరికిన దినాలలో తక్కువ ఆదాయమే వస్తుంది. గ్రామాల్లో పని దొరకపోవడంతో వలస పోతున్నారు. ప్రభుత్వాలు ఆసర కల్పించవలసిన అవసరము ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. వీరికి నెలకు 26 వేల రూపాయలు బ్రతకడానికి అవసరం అవుతుంది. ఆహార వస్తువులు ధరలు పెరిగిపోతున్నాయి. సాధారణ కూలీలు కొనుగోలు చేయలేకపోతున్నారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు సలీం, ప్రశాంత్. బి యాదగిరి. చెన్నారెడ్డి తో పాటు తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎంపీ అరుణ

**మహబూబ్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకాల గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త శ్రీకాంత్‌రెడ్డి అనార్యోగం వల్ల ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా సీఎంఆర్‌ఎఫ్ కోసం సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.60వేలు మంజూరయ్యాయి. ఈమేరకు రూ.60వేల ఎల్‌వోసీని ఎంపీ డీకే అరుణ సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీకి శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహబూబ్‌నగర్‌లో ఘనంగా రైతు దినోత్సవం

**మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు సన్మానం**

**మహబూబ్‌నగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** చౌదరి చరణ్ సింగ్ జన్మదినం సందర్భంగా రైతు దినోత్సవం పురస్కరించుకొని మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరీ అనిత మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సిబ్బంది అందరు రైతులను శాలువాలతో సత్కరించారు. ఆదర్శ రైతులకు లంచ్ బాక్స్‌లను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమను గుర్తించి సన్మానం చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే రైతులకు మంచి ధరలు, మెరుగైన సౌకర్యాలు అందించాలని కోరారు. అనంతరం చైర్ పర్సన్ అనిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే బోనస్ అందించడం జరిగిందని, రుణమాఫీ కూడా చేయడం జరిగిందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## అర్థనగ్న ప్రదర్శన చేసిన సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు

**గద్వాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఎస్ఎస్ఎ ఉద్యోగులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేయాలని సమ్మెకు దిగిన ఉద్యోగుల నిరవడిక దీక్ష నేడు 14 వ రోజుకు చేరుకున్నది. మా డిమాండ్ల ను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతి రోజు దీక్షా శిభిరంలో వందలాది మంది మహిళా ఉద్యోగులు, తమ పిల్లలతో కూర్చొని ప్రభుత్వన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, విజయ్, రామంజనేయులు, అల్తాఫ్, సమీ, ప్రణిత, జమున తదితరులు ఉన్నారు.

# రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన ఘనత కె.సి.ఆర్ దే**

**రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో వర్షాలు**

**మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి**



మంత్రి జూపల్లి మాట్లాడుతున్న వీడియోను చూపుతున్న మాజీ మంత్రి

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 23 ప్రభాతవార్త :** రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు ఎంత మేలు చేసామన్నదే ముఖ్యమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన ఘనత కె.సి.ఆర్దే అని అన్నారు. 90 శాతం పాలమూరు రంగారెడ్డి పూర్తి చేసిన 10 శాతం పూర్తి చేయలేని అసమర్థత ప్రభుత్వం రేవంత్ రెడ్డిదని దుయ్యబట్టారు. సాగునీరు కోసం, రైతు రుణమాఫీ కోసం, రైతు భరోసా కోసం రైతులు పడుతున్న కష్టాలు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వివరించారు. యాసంగి సీజన్ లో ఉమ్మడి పాలమూర్ ప్రాజెక్ట్ ద్వారా సాగు నీరు ఎలా ఇవ్వాలన్నదే నీటి పారుదల శాఖ మంత్రి బాధ్యత తీసుకుని నీళ్ల ఎన్ని ఉన్నాయి ఎంత స్టోరేజ్ ఉందని రైతులకు ముందే తెలపాలన్నారు. కె.సి.ఆర్ అంచనా ప్రకారం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారా భీమ ద్వారా 2 లక్షలు, కోయిల సాగర్ ద్వారా 40 వేలు కొడంగల్ లిఫ్ట్ కాకుండా 6 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇవ్వొచ్చనీ అన్నారు. ప్రభుత్వ అసమర్తవల్ల వరద నీళ్ల లేకపోతే యాసంగి నీళ్ల ఉండవని విమర్శించారు. పక్క నియోజక వర్గం ఫోటోలు పెట్టుకొని సంబరం తప్ప జూపల్లికి ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదని ఆరోపించారు. ఉత్తమ్ కుమార్ ఉత్తిత్తి మాటలని గతంలో జూపల్లియే చెప్పాడని 1984 నుండి 2004 కల్వకుర్తి పథకం మీద కేవలం 12 కోట్లు ఖర్చు పెట్టారని బిఆర్ఎస్ లో ఉన్నప్పుడు 100 సార్లు మాట్లాడారని ఎద్దేవ చేశారు. కె.సి.ఆర్, హరీష్ రావు వల్లనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి నీళ్ల ఇచ్చారని జూపల్లి అన్నారని ఇపుడు బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఎకరాకు నీళ్ల ఇవ్వలేదని ఇస్తే రాజీనామా చేస్తానన్న వారి విజ్ఞతకే వదిలి పెడుతున్నామని అన్నారు. బి అర్ ఎస్ పార్టీలో ఉండి మంత్రి పదవులు అనుభవించినప్పుడు తెలియదా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి వెళ్లి మంత్రి పదవి వచ్చిన తరువాత ఒక్క ఎకరాకు కూడా నీళ్ల ఇవ్వలేదని చెప్పడానికి సిగ్గు అనిపిస్తలేదా అని ఘాటుగా విమర్శించారు. 20 ఏండ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న నువు కాంగ్రెస్ లో ఉంటే పని జరిగినట్లు లేకపోతే వేరే పార్టీ లో ఉంటే పనులు కానట్లు మాట్లాడడం అంటే కొంచెమైన ఇంగిత జ్ఞానం ఉండాలి కదా అని మండిపడ్డారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు ఎంత మేలు చేసామన్నది ముఖ్యమన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతుల పథకం లో వనపర్తి నియోజకవర్గం లేదనీ అయిన ఒప్పించి నీళ్ళు తెచ్చామని గుర్తు చేశారు. గొంతులు తెగిన పరవాలేదని తెలంగాణ కోసం కొట్లాడినామని తెలంగాణ సాధించుకున్నామన్నారు. చోట మోట నాయకులు మాట్లాడితే ఎవరు బెదరరని అన్నారు. ప్రజలకు నీళ్ల ఎలా అందించాలో ఆలోచన చేయకుండా నీళ్ల అడిగితే బట్టలు ఉడగొడుతామనడం ఎంత వరకు సబబు అని పాలన చేస్తున్నారా లేక రౌడీ ఐజం చేస్తున్నారా అని ప్రశ్నించారు. నోటికి వచ్చినట్లు హామీలు ఇవ్వకూడదని హితవు పలికారు. ఈ సమావేశములో మాజీ గ్రంథాలయ చైర్మన్ బి.లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మీడియా ఇన్చార్జ్ నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్, కృష్ణా నాయక్, ఎద్దుల కరుణశ్రీ, వనం రాములు, విజయ్ కుమార్, పృథ్వీరాజ్, జగన్నాథం నాయుడు, తిరుపతయ్య, బాలరాజు, మాణిక్యం, చంద్రశేఖర్ నాయక్, జాత్రూ నాయక్, రాజశేఖర్, దిలీప్ రెడ్డి, మతీన్, చిట్యాల రాము, సునీల్ వాల్మీకి, రమేష్, మంద రాము తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ పెండింగ్ దరఖాస్తులను సత్వరం పూర్తి చేయాలి:కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, డిసెంబరు 23 ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు ఇందిరమ్మ ఇళ్ల పథకం మొబైల్ యాప్ సర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేందుకు మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వే సందర్భంగా మండలాల వారీగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇప్పటివరకు సేకరించిన లబ్ధిదారుల వివరాలు, వాటిని ఆన్‌లైన్ లో అప్లోడ్ చేసిన వివరాలు గురించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఆ వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని గ్రామ స్థాయిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలని పంచాయతీ జిల్లా అధికారికి ఆదేశించారు. ఎంపీడీఓలు సూపర్‌వైజర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, వారికి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, వారితో రోజుకు మూడుసార్లు నివేదికలు సేకరించాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు, సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పనిచేసి, వారి పనితీరును ఎంపీడీఓలు ప్రతిరోజూ పర్యవేక్షించాలని అన్నారు. బఫర్ సమయం తక్కువగా ఉన్నప్పుడు ఎంట్రీలు త్వరగా చేయాలని, అవి పూర్తయ్యేలా ఉదయం ప్రారంభించాలన్నారు. టార్గెట్ ఎప్పటికప్పుడు పూర్తిగా చేయడం అత్యంత ముఖ్యమని, లేకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులకు ఆదేశించారు. నెట్‌వర్క్ అందుబాటులో లేని ప్రాంతాల్లో, డేటా నమోదు కోసం పిజికల్ దరఖాస్తులను కూడా స్వీకరించాలని ఆదేశించారు. సిబ్బంది కొరత ఉన్నప్పుడు, అవసరమైతే ఇతర సిబ్బందిని సర్వే కోసం నియమించుకోవాలని అన్నారు. పాక్షికంగా సేవ్ చేసిన దరఖాస్తులను పరిశీలించి, నిజమైనవైతే మాత్రమే పాక్షిక స్థితిలో ఉంచాలని, లేదంటే పూర్తి స్థాయిలో నమోదు చేయాలని, అలాగే సర్వే ఎందుకు నిలిచిపోయిందో స్పష్టమైన కారణం నమోదు చేయాలని ఆదేశించారు.

పీఎం ఆవాస్ యాప్‌లో సర్వేయర్లు అందరూ కేవలం ఆన్‌లైన్ ఆథెంటికేషన్ మాత్రమే చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి, తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరించి ఇందిరమ్మ యాప్‌లో లాగిన్ అయ్యి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ప్రగతి తప్పనిసరిగా ఉండాలని, సర్వేను సమయానికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ, డి.పి.ఓ శ్యామ్ సుందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**బాలానగర్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కళ్యాణ'లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. బాలానగర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంపై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లె ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. అల్లు అర్జున్ అంటే తనకు కూడా ఇష్టమేనని, బాధ్యతారహితంగా వ్యవహరించినందుకే ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హయాంలో ముడా అనుమతుల ద్వారా వచ్చిన బాలానగర్ మండల ఆదాయాన్ని వేరే మండలాలకు తరలించారని, కానీ నా హయాంలో ముడా అనుమతుల ద్వారా బాలానగర్ మండలానికి వచ్చే ఆదాయాన్ని మండల అభివృద్ధికి ఉపయోగిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం బాలానగర్ మండలంలోని దేవుని గుట్ట తండాకు కోటి రూపాయలతో, తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి కోటి 13 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అశ్విని రాజేశ్వర్ రెడ్డి, తాహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తాహసిల్దార్ లిఖితా రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, దత్తాత్రేయ, మాజీ ఎంపిటిసి వెంకట్ రామ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన ఉపాధ్యక్షులు మోహన్ నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు శ్రీనాథ్ నాయక్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ప్రజలను ఆదరిస్తుంది

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నా రెడ్డి**



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 23 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ప్రజలను, వారి విశ్వాసాలను సమానంగా అదరిస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నా రెడ్డి అన్నా రు. డిసెంబర్ 25న యేసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం ఆలివ్ మెన్నోనైట్ బ్రెట్లం చర్చిలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రైస్తవులకు ఏర్పాటు చేసిన లవ్ ఫీస్ట్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 25వ తేదీన యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదర సోదరిమణులు కలిసి ఉత్సవాలు జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లవ్ ఫీస్ట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యేసు ప్రభు దైవ దూత అని రోగులను, పాపులను, పీడితులను తన ప్రేమతో నయం చేస్తారని చెప్పారు. తాను జరుసలెం, బ్రేతలాం సందర్శించానని తెలిపారు. క్రిస్టియన్ మిషనరీ ద్వారా గొప్ప విద్యాలయాలు, వైద్య శాలలు ఏర్పాటు చేశారని కొనియాడారు. పిల్లలను బాగా చదివించుకోవాలని అప్పుడే అభివృద్ధి సాధిస్తారని సూచించారు. ఆలివ్ యం.బి. చర్చి ప్రాంతంలో ఒకప్పుడు వైద్య శాల, విద్యాలయం ఉండేదని, ప్రస్తుతం ఉన్న పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని క్రైస్తవ సోదరులకు క్రిస్ట్ మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పాస్టర్లకు పంచారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా క్రైస్తవ సోదర సోదరీమణులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని అందరితో కలిసి సహ పంక్తి భోజనం చేసారు. అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ మహేష్, మాజీ జడ్పి చైర్మన్ ఆర్. లోక్ నాథ్ రెడ్డి, తహశీల్దార్ రమేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ, క్రిస్టియన్ సంఘ నాయకులు ప్రసాద్, జయానంద్, జానప్ప, బెంజమిన్, రొనార్డ్, సుకన్య క్రిస్టియన్ సోదరులు అనేక మంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం .. ప్రజావాణికి 142 దరఖాస్తులు**



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కల్టెక్టరేట్ కార్యాలయం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం (142) దరఖాస్తులు రాగా రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయతీ, పించన్ లు ఇతర సమస్య కు సంబంధించి ధరఖాస్తులు వచ్చాయని, వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారు ఇచ్చిన అంశాలను పరిశీలించి మొబైల్ యాప్ లో వివరాలను పొందుపర్చాలని సూచించారు. మండలాలు, మున్సిపాలిటీ ల వారీగా సర్వే వివరాలను సమీక్షించి సర్వే వేగవంతం చేయాలని అన్నారు. ఎన్యుమరేటర్‌లను అదనంగా ఏర్పాటు చేసుకొని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఎం.పి.డి.ఓ.లు, తహశీల్దార్ లు, మండల ప్రత్యేక అధికారులు సర్వేను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ నర్సింహులు, జడ్‌పి సిఈఓ వెంకటరెడ్డి ,ఆర్‌డిఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇందిరమ్మ ఇంటిని తనిఖీ చేస్తా

**ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని, ప్రతి లబ్ధిదారు ఇంటిని నిర్మించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మునిసిపాలిటీ కార్యాలయ ఆవరణలో మోడల్ హౌస్ నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిసె లేని సమాజ స్థాపన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి నియోజకవర్గంలో 3500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వివరించారు. గతంలో వైయస్సార్ హయాంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించారని, ప్రస్తుతం అవసరం ఉన్న ప్రతి లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తిస్థాయిలో విచారణ చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఇంటిని తనిఖీ చేస్తామన్నారు. మోడల్ హౌస్ నిర్మాణానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, చైర్మన్ కల్పన, కౌన్సిలర్లు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**తాడూర్‌లో....** తాడూరు మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మోడల్ హౌస్ పనులను సోమవారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సర్వే అభినందనీయం

**శీతకాల ప్రత్యేక శిబిరం ముగింపు వేడుకలో పియు వీసీ శ్రీనివాస్**




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములవడం అభినందనీయమని పాలమూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్ అన్నారు. పియూ క్యాంపస్‌లో అతిధి గృహ పరిసర ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 9 ఆధ్వర్యంలో చేపట్టిన ఏడు రోజుల శీతాకాల ప్రత్యేక శిబిరం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సేవా పథకం ద్వారా సమాజ సేవ చేయవచ్చని, నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, మొదలగు లక్షణాలు పెంపొందించుకోవచన్నారు. అల్లిపూర్ గ్రామంలో ఆరోగ్య సర్వే చేయడం అభినందనీయమని, వాలంటీర్స్ సామాజిక రుగ్మతలను రూపుమాపాలని అన్నారు. రిజిస్ట్రార్ చెన్నప్ప మాట్లాడుతూ బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు మొదలగు విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఓ ఎస్ డి మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ప్రవీణ, చైర్మన్ డా. చంద్ర కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్య , ప్రోగ్రాం అధికారి డా. అర్జున్ కుమార్, ఎంబీఏ విభాగాధిపతి డా. నాగసుధ, అధ్యాపకులు డాక్టర్ జావిద్ ఖాన్ డాక్టర్ అరుంధతి, వాలంటీర్స్ పాల్గొన్నారు.